- స్వరాష్ట్రంలోనే అర్హులకు అందుతున్న సాయం
- ఆదుకున్న రైతుబీమా, కల్యాణలక్ష్మి, రైతుబంధు
- సీఎం కేసీఆర్ వల్లేనని లబ్ధిదారుల హర్షం

# ముచ్చటగా మూడు కానుకలు

**ఒకే ఇంటికి మూడు సంక్షేమ పథకాలు**

నర్సింహులపేట, అక్టోబర్ 7 : సమైక్యపాలకుల హయాంలో అర్హతలున్నా సంక్షేమ ఫలాలు అందని ద్రాక్షే అయ్యేవి. కాళ్లరిగేలా తిరిగినా ఏ పథకానికీ నోచుకోక ఆవేదన చెందాల్సి పరిస్థితులుండేవి. కేవలం పలుకుబడి ఉన్న వారికే తప్ప 'సర్కారు సాయం' అందిన దాఖలాలు లేవు. కానీ స్వరాష్ట్రం సాధించుకున్న తర్వాత కేసీఆర్ సర్కారు పాలనలో అందుకు భిన్నంగా అర్హులైన ప్రతి లబ్ధిదారుకు ప్రభుత్వ సంక్షేమ పథకం దరిచేరుతున్నది. మంజూరు కాగానే నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే డబ్బులు జమ అవుతున్నాయి. ఫలితంగా పేదల ముఖాల్లో చిరునవ్వు కనిపిస్తున్నది. ఒకప్పుడు ఒక్క పథకం రావడం గగనమైన పరిస్థితి నుంచి ఇప్పుడు ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా ఒకే ఇంట్లో మూడు నుంచి నాలుగు సంక్షేమ పథకాలు అందుతుండడం విశేషం. ఇలా మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలంలో ఒకే ఇంట్లో ముచ్చటగా మూడు సంక్షేమ పథకాల మంజూరయ్యాయి. ఏటా రూ.25వేలు అందించే రైతుబంధు, ఆపద సమయంలో రూ.5 లక్షల అందించిన రైతుబీమా, ఆడబిడ్డ పెండ్లికి రూ.లక్షా నూట పదహారు వేల సాయం అందించిన కల్యాణలక్ష్మి పథకాలు రావడంతో వారి సంతోషానికి అవధుల్లేకుండా పోయింది. మూడు పథకాల ద్వారా లబ్ధి చేకూరడంతో సీఎం కేసీఆరే ఆదుకున్నారని, తమకు మేలు చేసిన ముఖ్యమంత్రి సల్లంగ ఉండాలని నిండుమనస్సుతో దీవిస్తున్నారు. ఇలా ఒక్కో కుటుంబంలో మూడు, నాలుగు పథకాలు అందుతున్నాయి. అంతేగాక చాలా కుటుంబాల్లో రైతుబంధు, సీఎం సహాయనిధితో పాటు ఆసరా పింఛన్లు అందుతుండడంతో ఎంతోమందికి న్యాయం చేకూరుతున్నది.

### కేసీఆర్ సాయం మరువం..



కుటుంబ సభ్యులు అందరూ కలిసి పనిచేస్తేనే ఇల్లు గడుస్తుంది. నా చిన్నతనంలో పంటకు పెట్టుబడి కోసం తెచ్చిన డబ్బులు తీర్చలేక మా నాన్న జాటోతు బిచ్చు పురుగుల మందు తాగి చనిపోయాడు. అప్పుడు ఉన్న గవర్నమెంట్ మమ్ముల ఆదుకోలేదు. మా అక్క పెళ్లికి ప్రభుత్వం కల్యాణలక్ష్మితో రూ.లక్షా 16 ఇచ్చింది. తెలంగాణ సర్కార్ వచ్చిన తర్వాత పంట పెట్టుబడి కోసం ఎకరానికి రూ.10వేల చొప్పున మాకు రూ.25 వేలు ఏడాదికి ఇస్తున్నది. సెప్టెంబర్ నెలలో మా అమ్మ అనారోగ్యంతో చనిపోయింది. తర్వాత అధికారులు వచ్చి 10 రోజుల్లో రూ.5లక్షలు మా ఖాతాలో వేశారు. అన్ని విధాలా ఆదుకున్న ప్రభుత్వాన్ని నా జీవితాంతం గుండెల్లో పెట్టుకుంటా.

**- జాటోత్ వీరన్న, ఎర్రచక్రుతండా**



### కల్యాణలక్ష్మితో బిడ్డ పెండ్లికి ఆసరా

నా కూతురుకు పెండ్లి చేశాను. పెండ్లి తర్వాత కల్యాణలక్ష్మికి దరఖాస్తు చేసుకుంటే కొద్ది రోజుల్లోనే నా భార్య మీద లక్షా 116 రూపాయల చెక్కును అధికారులు ఇంటికొచ్చి ఇచ్చారు. నాకు ఉన్న వ్యవసాయ పొలంలో రైతుబంధు ద్వారా ఏడాది రూ.25 వేలు ఇస్తున్నారు. సర్కారు దవాఖానలో మా కోడలుకు బిడ్డ, కొడుకు పుడితే కేసీఆర్ కిట్లు వచ్చాయి. వారికి సర్కారు దవాఖానలో చూపిస్తే ఇద్దరు పిల్లలకు డబ్బులు వచ్చినయ్. మాది వడ్రంగి కుటుంబం కావడంతో బీసీబంధు కింద లక్ష రూపాయల చెక్కు కూడా ఇచ్చారు. కేసీఆర్ ఇన్ని పథకాలు అమలు చేయడం వల్ల మాకు న్యాయం జరిగింది. మంచి చేస్తున్న కేసీఆర్ మేలును ఎప్పటికీ మర్చిపోం.

**- బనాల వెంకన్నచారి, పెద్దనాగారం**

### తెలంగాణ సర్కారే ఆదుకున్నది

నా భర్త అనారోగ్యంతో హైదరాబాద్ హాస్పిటల్‌లో చికిత్స చేయిస్తున్న క్రమంలో ఎమ్మెల్యే రెడ్యానాయక్ ముందస్తుగా చికిత్స కోసం ఎల్ఓసీ కింద రూ. 3.50లక్షలు ఇచ్చారు. అయినా ఆయన బతకలేదు. భర్త పేరు మీద భూమి ఉండడంతో ప్రభుత్వం రైతుబీమా పథకం కింద రూ.5 లక్షలు ఇచ్చి ఆదుకున్నది. చికిత్స సమయంలో రూ.20లక్షల వరకు హాస్పిటల్ ఖర్చు అయినందున సీఎం సహాయనిధికి దరఖాస్తు పెట్టుకున్నం. కొద్ది రోజులకే రూ.లక్షా 50వేలు వచ్చినయ్. వాటితో పాటు రైతుబంధు డబ్బులు కూడా ఖాతాలో జమవుతున్నయ్.

**- సలుగు సూరమ్మ, కొమ్ములవంచ**





### సీఎం కేసీఆర్ రుణం తీర్చుకోలేం

నాకు ముగ్గురు పిల్లలు. ఇద్దరు బిడ్డలు, ఒక కొడుకు. ఆంధ్రా ప్రభుత్వం ఉన్నప్పుడు పెద్ద కుమార్తె పెళ్లి చేసినం. అప్పుడు ఏమీ రాలేదు. తెలంగాణ సర్కార్ వచ్చిన తర్వాత చిన్న బిడ్డ పెళ్లి చేసినం. చిన్నకూతురు పెండ్లికి కేసీఆర్ ప్రభుత్వం కల్యాణలక్ష్మి ఇస్తుందని ఊరోళ్లు చెప్తే మీసేవలో దరఖాస్తు చేశాను. కొద్ది రోజుల్లోనే లక్షా 116 రూపాయలు వచ్చినయ్. అలాగే అనారోగ్యంతో భర్త సోమయ్య చనిపోయాడు. విషయం తెలుసుకుని వ్యవసాధికారులు వచ్చి చూసి పోయారు. 10 రోజుల్లో ప్రభుత్వం మాకు రైతుబీమా ద్వారా నా ఖాతాలో రూ.5లక్షలు వేశారు. వాటితో అప్పులు తీర్చిన. నా భర్త పేరున భూమి ఉండడంతో మాకు రైతుబంధు డబ్బులు వస్తున్నాయి. మాకు మేలు చేసిన కేసీఆర్ సల్లంగ ఉండాలె.

**- పుప్పాల నర్సమ్మ, కొమ్ములవంచ**



ఎంఆర్ఐ స్కాన్ విభాగాన్ని ప్రారంభిస్తున్న మంత్రి దయాకర్‌రావు

# ఆరోగ్య తెలంగాణే లక్ష్యం

**కార్పొరేట్‌ను మించి ప్రభుత్వ వైద్యసేవలు**

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- ఎంజీఎంహెచ్‌లో రూ.10.6 కోట్లతో అత్యాధునిక ఎంఆర్ఐ స్కాన్ యంత్రం, ప్రత్యేక టైప్ వన్ డయాబెటిక్ క్లినిక్ ప్రారంభోత్సవం
- పాల్గొన్న శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్యే నరేందర్



ఓపీ ఆర్థో విభాగంలో రోగులతో మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు



### ఎంఆర్ఐ యంత్ర ప్రత్యేకతలు

- సాధారణ ఎంఆర్ఐ యంత్ర పరికరాల తయారీకి హీలియం వినియోగిస్తారు. దీని మూలంగా యంత్ర నిర్వహణ భారీ ఖర్చుతో కూడుకొని ఉంటుంది. కానీ, ఈ ఎంఆర్ఐ యంత్రంలో హీలియం వినియోగం లేకపోవడం మూలంగా తక్కువ నిర్వహణ ఖర్చులతో ఎక్కువ సమయం వినియోగించుకునే అవకాశం ఉంటుంది.
- హీలియం వినియోగం లేకపోవడం వల్ల తక్కువ సమయంలోనే మరమ్మతులు, నూతనంగా సమకూర్చుకునే సాంకేతికతను ఇన్‌స్టాల్ చేసుకోవడం, ప్రస్తుతం వినియోగిస్తున్న దానిని అప్‌గ్రేడ్ చేసుకునేందుకు వీలుగా ఉంటుంది.
- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విధానంలో పనిచేసే ఈ యంత్రంతో రోగి పరిస్థితిపై పూర్తి సమాచారాన్ని పొందే వీలుంటుంది.
- ప్రభుత్వ నిబంధనల ప్రకారం రానున్న పదేళ్ల వరకు యంత్ర మరమ్మతులు, నిర్వహణ ఖర్చులను సంబంధిత కంపెనీయే చూసుకుంటుంది.
- ఈ ఆధునిక యంత్రం ద్వారా మనిషి తల భాగాన్ని రెండు నిమిషాలు, వెన్నెముఖ పూర్తి భాగాన్ని కేవలం నాలుగు నిమిషాల్లోనే పూర్తిస్థాయిలో పరీక్షించవచ్చు.
- ఈ యంత్రంలో ఏర్పాటుచేసిన ఆధునిక సాంకేతికత మూలంగా సుమారు 40శాతం రిజల్యూషన్ ఎక్కువగా ఉంటుంది. దీంతో రోగి ప్రస్తుత పరిస్థితిని మరింత కచ్చితత్వంతో పరిశీలించే అవకాశం ఉంటుంది.
- తక్కువ శబ్దం, వెడల్పాటి ఫీల్డ్ వ్యూ కారణంగా రోగి ఆందోళన పడే అవకాశం కూడా చాలా తక్కువ ఉంటుంది.
- ఈ యంత్రం ఇతర ప్రాంతాల్లో ఉన్న వైద్యులు, నిపుణులకు సైతం నేరుగా రోగి ఆరోగ్య పరిస్థితిని తెలియజేసేలా కమ్యూనికేషన్ వ్యవస్థను కలిగి ఉంది.



వరంగల్ చౌరస్తా, అక్టోబర్ 7 : పేదలకు కార్పొరేట్ వైద్యసేవలను అందుబాటులోకి తేవడంతోపాటు మెరుగైన వైద్యసేవలు అందించి ఆరోగ్య తెలంగాణ సాధనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు స్పష్టం చేశారు. ఎంజీఎం దవాఖానలో 'తెలంగాణ స్టేట్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎస్ఎంఎస్ఐడీసీ) ఆధ్వర్యంలో రూ.10.6కోట్లతో అందుబాటులోకి తెచ్చిన ఫిలిప్స్ కంపెనీకి చెందిన 1.5 టెస్లా సిస్టమ్ సామర్థ్యం కలిగిన మ్యాగ్నెటిక్ రిసోనెన్స్ ఇమేజింగ్(ఎంఆర్ఐ) యంత్రాన్ని, టైప్ వన్ డయాబెటిక్ క్లినిక్‌ను శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్‌తో కలిసి శనివారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంజీఎం హాస్పిటల్ పెద్ద దిక్కుగా నిలిచిందన్నారు. ఉమ్మడి పాలనలో ప్రైవేట్ హాస్పిటళ్ల ధాటికి కొంత ఇబ్బంది కరమైన పరిస్థితులను ఎదుర్కొన్న ఎంజీఎంకు కేఎంసీ పూర్వ విద్యార్థుల దాతృత్వంతో కొన్ని యంత్రాలు సమకూరాయని వివరించారు. అలాంటి పరిస్థితి నుంచి తెలంగాణ ప్రభుత్వం వచ్చాక ఎంజీఎం పూర్వవైభవాన్ని పొందుతూ వస్తున్నదని చెప్పారు. వరంగల్‌ను హెల్త్ హబ్‌గా మార్చేందుకు సీఎం కేసీఆర్ రూ.1200కోట్లతో దేశంలోనే ఎక్కడాలేని విధంగా 24 అంతస్తులతో 36 రకాల సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలను ఉచితంగా అందించేందుకు అతిపెద్ద హాస్పిటల్‌ను నిర్మిస్తున్నారన్నారు. హాస్పిటల్ అందుబాటులోకి వచ్చాక ఇక వైద్యం కోసం హైదరాబాద్ వెళ్లాల్సిన అవసరం రాదని, హైదరాబాద్ నుంచే వరంగల్ వచ్చే పరిస్థితి ఏర్పడుతుందని చెప్పారు. ఉమ్మడి పాలనలో ప్రభుత్వ వైద్యశాలల్లో గుండె ఆపరేషన్లు సరిగా జరగకపోయేవని, ఇప్పుడు 100 శాతం సక్సెస్ రేటుతో చేస్తున్నారన్నారు. కరోనా కాలంలో సుమారు లక్షా ఐదు వేల మందికి ఎంజీఎం వైద్యసేవలను అందించిందని గుర్తుచేశారు. ప్రజల ప్రాణాలు కాపాడేందుకు కృషిచేస్తున్న వైద్యులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. అనంతరం ఓపీ, ఏఎంసీ విభాగాల్లో రోగులతో మాట్లాడి వైద్యసేవల తీరును అడిగి తెలుసుకున్నారు.

### ఉమ్మడి వరంగల్‌లో ఏడు మెడికల్ కాలేజీలు : బండా ప్రకాశ్

రాష్ట్ర ప్రభుత్వం ఎంజీఎంను వెయ్యి పడకల స్థాయికి పెంచి తగిన నియామకాలు చేపట్టి వైద్యసేవలను విస్తృతం చేసిందని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ అన్నారు. జిల్లాకో మెడికల్ కాలేజీ ఏర్పాటుతో ఉమ్మడి వరంగల్ పరిధిలో ప్రస్తుతం ఏడు మెడికల్ కళాశాలలు ప్రారంభమై విద్యాభ్యాసం కొనసాగుతోందన్నారు. కరోనా సమయంలో ఆక్సిజన్ అందించలేక ప్రైవేట్ హాస్పిటళ్లు చేతులెత్తేసినా ఎంజీఎం పెద్ద దిక్కుగా నిలిచి ప్రాణాలు పోసిందని గుర్తుచేశారు. ప్రస్తుత ఆహారపు అలవాట్లతో చిన్న వయస్సులోనే డయాబెటిస్ బారిన పడుతున్న వారికి ప్రత్యేకంగా ఓపీ విభాగంలో క్లినిక్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఎంజీఎంలో సేవలను మెరుగుపరచడం, విస్తృత పరచడం కోసం కార్పొరేట్ కంపెనీలను సైతం ఒప్పించి నిధులు తెచ్చామని చెప్పా రు. ఎంజీఎంలో డయాలసిస్ సేవలు మెరుగ్గా అందుతున్నాయన్నారు.

### తెలంగాణలోనే దవాఖానల ఆధునీకరణ : ఎమ్మెల్యే నరేందర్

సర్కారు వైద్యశాలల్లో ఆధునిక యంత్రాలను ఏర్పాటు చేస్తూ కార్పొరేట్ స్థాయి వైద్యసేవలను ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెస్తున్నదని ఎమ్మెల్యే నరేందర్ అన్నారు. ఏడాదిపాటు ఎంఆర్ఐ యంత్రం పనిచేయకపోవడంతో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకుపోగా వెంటనే ఆయన స్పందించి అత్యాధునిక యంత్రం ఏర్పాటుకు ఆదేశాలిచ్చారని చెప్పారు. ఖరీదైన వైద్యాన్ని ప్రభుత్వ హాస్పిటళ్లలో అందుబాటులోకి తేవడం మూలంగా ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో నమ్మకాన్ని పెంచామన్నారు.రూ.10కోట్లతో ఏర్పాటుచేసిన యంత్రంతో పేదలకు మెరుగైన సేవలు అందించాలని వైద్యులను కోరారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రావీణ్య, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఆర్ఎంఓలు డాక్టర్ హరీశ్‌రాజ్, డాక్టర్ మురళి, డాక్టర్ రామ్‌కుమార్‌రెడ్డి, 24వ డివిజన్ కార్పొరేటర్ ఆకుతోట తేజస్వి, పలువురు విభాగాధిపతులు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



# అల్లరి

ALLARI





**సీహెచ్ అఖిల్**, నల్గొండ.

పెయింటర్ హ్యాండ్స్

**టంగ్ ట్విస్టర్**




Double bubble gum, bubbles double.

**కథ**


# అసలైన కథ!

... మొర్రి గోపి



**''తాతయ్యా!** నేను ఓ కథ రాశాను. చదివి ఎలా ఉందో చెప్పు!'' అంటూ తన రచనను హనుమంతరావు చేతికి ఇచ్చాడు రాహుల్. మనవడు రాసిన కథను చదివి, రాహుల్ వైపు ఒకసారి ప్రశ్నార్థకంగా చూశాడు హనుమంతరావు. ''ఎలా ఉంది?'' అని అడిగాడు రాహుల్. ''ఒరేయ్! కథలో నాయకుడు ఉండాలి కదా! నువ్వు అడ్డదారుల్లో జీవించే ప్రతి నాయకుణ్ని నాయకుడిగా చెలామణి చేశావు. చెడు పనులు చేసేవాడు ఎప్పుడూ నాయకుడు కాలేడు. కథ కూడా మంచినే ఉద్బోదించాలి. కానీ, నీ కథలో నువ్వు నాయకుడిగా అనుకున్న పాత్ర.. అంతా అడ్డదారుల్లోనే ప్రయాణించింది. నువ్వు ఈ కథ ద్వారా.. చెడు మార్గంలో ప్రయాణిస్తే ప్రయోజకులు అవుతారని పాఠకులకు చెప్పదలుచుకున్నావా?'' అని అడిగాడు. ''అలా అంటావేంటి తాతయ్య! ఈమధ్య నేను చూసిన సినిమాల్లో సకల వ్యసనాలు ఉన్నవాళ్లనే హీరోలుగా చూపిస్తున్నారు. అడ్డదారుల్లో అందలం ఎక్కేవారే హీరోలు. అలాంటి సినిమాలకే ప్రేక్షకులు బ్రహ్మరథం పడుతున్నారు'' అంటూ వివరణ ఇచ్చాడు రాహుల్. ఆ మాటలకు ఆయన నవ్వి.. ''కథా రచయితగా నువ్వు ఎప్పుడూ సమాజం మేలుకోరాలి. నువ్వు రాసే కథ ద్వారా చదివిన వారిలో మార్పు రావాలి. నలుగురికీ మేలు చేయకపోయినా ఫర్వాలేదు గానీ, అడ్డదారుల్లో వెళ్లేవారిని హీరోలుగా చిత్రీకరించి, సమాజానికి కీడు కలిగించడం మాత్రం తప్పు!'' అంటూ హితవు చెప్పాడు. పదో తరగతి చదువుతున్న రాహుల్ మీద సినిమాల ప్రభావం ఎక్కువ. అందుకే అలా రాశాడు. తాతయ్య మాటలతో.. సమాజాన్ని మంచివైపు నడిపించేదే అసలైన సాహిత్యం.. అని గ్రహించాడు.

**తేడాలు కనిపెట్టండి**



**ఒకేలా కనిపిస్తున్న ఈ రెండు చిత్రాల్లో 10 తేడాలున్నాయి. అవేంటో కనిపెట్టండి.**

**పెద్దల మాట**



ఉత్తమ సాహిత్యం సమ్యక్ జ్ఞానాన్ని ప్రసాదిస్తుంది. కాలక్షేప సాహిత్యం ఆలోచనల్ని పక్కదారి పట్టిస్తుంది.

**- చాణక్యుడు**

**పూరించండి**





**బొమ్మల ఆధారంగా ఖాళీలను పూరించండి.**

**పదవినోదం**



కింది పదంలోని అక్షరాల సాయంతో ఎన్ని కొత్త పదాలను సృష్టించగలరో చూడండి.

**Healthy**

Ex : Heal

**తెలుసుకుందాం**

1. దేశంలో అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు?
   **- స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**
2. ప్రపంచంలో లోతైన సరస్సు?
   **- లేక్ బైకాల్ (సైబీరియా)**
3. యాలకులు మొక్కలోని ఏ భాగం నుంచి వస్తాయి?
   **- ఫలం**

జవాబులు : పూరించండి : CUP, CRAB

పిల్లలూ! మీరు గీసిన బొమ్మలు, రాసిన కథలు, జోక్స్ మాకు పంపండి. బాగుంటే ప్రచురిస్తాం. మా చిరునామా : zindagi@ntnews.com